

ఉప్పల్‌లో స్కైవాక్



ఎస్కలేటర్ ఎక్కి హాయ్ చెబుతున్న మంత్రి కేటీఆర్

పాదచారి.. హాయిగా.. నడిచి వెళ్లోయి..

ఉప్పల్: ఉప్పల్‌లో స్కైవాక్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రి ముందుగా శిల్పారామంలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించారు. అనంతరం ఉప్పల్ చౌరస్తాకు చేరుకుని స్కైవాక్‌ను మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు రజిత పరమేశ్వర్‌రెడ్డి, బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం థీమ్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన ఎస్కలేటర్ ద్వారా స్కైవాక్ వంతెనను ఎక్కారు. స్కైవాక్‌పై సౌకర్యాల గురించి ఆరా తీశారు. ఎస్కలేటర్ ద్వారా కిందకు దిగుతూ అభిమానులు, కార్యకర్తల హాయి చెబుతూ.. షేక్‌హ్యాండ్ ఇస్తూ వారిలో ఉత్సాహం నింపారు.





క్లుప్తంగా...

మంత్రి కేటీఆర్‌కు వినతి



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రము అందజేసిన కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ఉప్పల్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన మంత్రి కేటీఆర్‌కు మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ ఫేస్–2, తిరుమలనగర్, కృష్ణానగర్, హెచ్‌బీకాలనీలతో పాటు మరికొన్ని కాలనీల్లో అండర్ గ్రౌండ్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. తన అభ్యర్థనపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ప్రభుదాస్ తెలిపారు.

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు



కౌకూర్‌లో పర్యటిస్తున్న అధికారులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని కౌకూర్ తదితర ప్రాంతాల్లో జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు పర్యటించారు. స్థానికంగా నెలకొన్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం తదితర సమస్యలను తెలుసుకున్నారు. ఔట్ ఫ్లో సదుపాయం సరిగ్గా లేకపోవడంతో డ్రైనేజీ పొంగి పొరుతోందని గుర్తించారు. త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అధికారులు నాగేందర్, సునీల్‌కుమార్, భాస్కర్, మహేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గౌతంనగర్: దశాబ్ద కాలంగా పేదలకు సేవలందించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా మందిరాలు నిర్మాణాలు చేపట్టడంతోపాటు ఇళ్లు లేని దళితులకు సొంత ఖర్చులతో ఇళ్లు నిర్మించి ఇస్తున్న ప్రముఖ సంఘ సేవకులు మన్నవవీర నాగేశ్వరరావు దంపతులకు హనుమాన్‌పేట్‌కు చెందిన కళాకారుడు, సంఘ సేవకులు ఏవీ.స్వామి దంపతులు సోమవారం ఘనంగా సన్మానించి అభినందించారు.

ఐఐహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రాజు



రామంతాపూర్: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజిషియన్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉప్పల్‌కు చెందిన డాక్టర్ ఎం.ఎస్. రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ తన్వీర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్‌వీ శివరామమూర్తి, సెక్రటరీ మహేష్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సెమినార్‌లో రాజుతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోరంట్ల చంద్రశేఖర్, ట్రెజరర్‌గా పద్మజారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చెరువుల ఆక్రమణలను అరికట్టాలి



అల్వాల్ తహసీల్దార్ నాగమణికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అల్వాల్: అల్వాల్ చెరువుల ఆక్రమణలను అరికట్టాలని మండల తహసీల్దార్ నాగమణికి బీజేపీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అల్వాల్‌లోని కొత్త చెరువు, చిన రాయుడి చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఇటీవల ఆక్రమణలు జరుగుతున్నాయని, వీటిని క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి చెరువుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వై.గోపి, శేఖర్, కార్తీక్, లక్ష్మణ్, వెంకటేష్, అనిల్‌యాదవ్, అజయ్‌రెడ్డి, అనిల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



మల్లాపూర్: తెలంగాణ టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమితులైన సూర్ణం రాజేష్‌ను సోమవారం మల్లాపూర్ బ్యాంక్ కాలనీవాసులు ఘనంగా సత్కరించారు. బ్యాంక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్‌కు కార్పొరేటర్ల వినతులు



చిలుకానగర్ సమస్యలపై మంత్రికి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్



ఉప్పల్ డివిజన్ సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రజిత

ఉప్పల్: మంత్రి కేటీఆర్‌కు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్‌రెడ్డి తమ డివిజన్ల సమస్యలపై వేర్వేరుగా వినతి పత్రాలను మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. చిలుకానగర్ డివిజన్‌లో 50 పడకల ఆసుపత్రి నిర్మించాలని, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించాలని, మంత్రికి అందజేసిన వినతి ప్రతంలో కార్పొరేటర్ గీత కోరారు. ఉప్పల్ డివిజన్‌లో డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాన్ని నిర్మించి ఇవ్వాలని, ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని, ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లేఅవుట్‌లో మౌలిక వసతులు కల్పించాలని, ఎలివేటెడ్ కారిడార్ పనులను వేగంగా పూర్తి చేయాలని వినతి పత్రంలో రజిత కోరారు.

ఉప్పల్‌లో గంటల తరబడి ట్రాఫిక్ జాం



ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ వంతెన ప్రారంభానికి విచ్చేస్తున్న మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలకడానికి వందలాది మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు నాయకులు ఉప్పల్ చౌరస్తాకు తరలివచ్చారు. దీంతో ఉప్పల్ పరసర ప్రాంతాల్లో గంటల తరబడి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ముందస్తుగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినా ఫలితం లేకుండా పోయింది. ఒక పక్క బండారు లక్ష్మారెడ్డి అభిమానులు, కేటీఆర్ మాస్కులతో ఫ్లకార్డులతో ఒక్కసారిగా ప్రారంభ వేదిక వద్దకు చేరుకోగానే ట్రాఫిక్ తిప్పలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత బొంతు రామ్మోహన్ అభిమానులు గుంపులు గుంపులుగా రోడ్డుపైకి రావడంతో దాదాపుగా 4 గంటల పాటు సామన్య ప్రజలు ట్రాఫిక్‌తో తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు



హెచ్‌బీకాలనీలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మునుగంటి రాంప్రదీప్



ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

కుషాయిగూడ: కేటీఆర్ ఉప్పల్ పర్యటనను నిరసిస్తూ బీజేపీ తలపెట్టిన ఉప్పల్ బంద్‌లో భాగంగా పోలీసులు సోమవారం ఉదయమే బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మునుగంటి రాంప్రదీప్, బీజేవైఎం నేత సందీప్‌యాదవ్‌ను ఇళ్ల వద్దనే అదుపులోకి తీసుకున్నారు. చర్లపల్లి డివిజన్‌లో నాదం, నర్సింగ్‌రావు, ఎజాజ్‌లను అదుపులోకి తీసుకొని చర్లపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఉప్పల్‌లో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌ను ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిన బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున అక్కడికి తరలివెళ్లి మద్దతుగా నిలిచారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు.

ప్రమోషన్ ఒక మైలురాయి వంటిది

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

అల్వాల్: ప్రమోషన్ అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఒక మైలురాయి అని, ముఖ్యంగా పోలీసులు మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తూ ఇటీవల ఏసీపీలుగా పదోన్నతులు పొందిన అధికారులు సోమవారం రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్‌ను నేరేడ్‌మెట్‌లోని సీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన అధికారులను సీపీ అభినందించి కొన్ని సూచనలు చేశారు. పోలీస్‌శాఖలో పనిచేస్తూ ఎన్నో ఏళ్లుగా ప్రజా సంరక్షణ కోసం అవిశ్రాంతంగా చేసిన కృషికి పదోన్నతులు గొప్ప గుర్తింపు అన్నారు. ప్రమోషన్ అనేది ఒక మైలురాయి వంటిదన్నారు. ఇక నుంచి మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ పేరును కాపాడుకోవాలన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్ ప్రతిష్టను పెంపొందించే విధంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రమోషన్ పొందిన ఏసీపీలు లక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌గౌడ్, జానకిరెడ్డి, నవీన్, నవీన్ రెడ్డి, ప్రకాష్ తదితరులు ఉన్నారు.



ప్రమోషన్ పొందిన ఏసీపీలతో సీపీ డీఎస్ చౌహాన్

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు భేష్



గౌతంనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ శ్రేణులు

గౌతంనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసంశెట్టి శ్రీనివాస్ అన్నారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తొమ్మిదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో దేశంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. నాయకులు లక్ష్మణ్‌రావు, మంజుల, బండారి రవి, స్వర్ణలత, బాలసుబ్రహ్మణ్యం, మల్లారెడ్డి, వెంకట్ యాదవ్, బలరాం, రాజేష్, దత్తు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌కు తరలిన బీఆర్‌ఎస్ నేతలు

మల్లాపూర్: ఉప్పల్ స్కైవాక్ ప్రారంభోత్సవానికి నాచారం డివిజన్ బీఆర్‌ఎస్ నేతలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. నాలుగు బస్సులు, 150 ద్విచక్ర వాహనాలు, 35 ఆటోలతో ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు, ఆటో యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

ఓల్డ్‌మల్లాపూర్ నుంచి..

మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ కేటీఆర్ ప్రోగాంకు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుదేవ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ఉప్పల్: 11కేవీ నాచారం ఫీడర్ మరమ్మతుల కారణంగా ఐఐసిటి సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు హబ్సిగూడ వీధి నంబర్–1 నుంచి 3 వరకు, హరిజన బస్తీ, పీఅండ్‌టీ కాలనీ, కాకతీయ నగర్ పార్కు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రామిరెడ్డి తెలిపారు. 11కేవీ హెచ్‌ఎంటీ నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా, ఎన్‌జీఆర్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు హెచ్‌ఎంటీనగర్ వీధి నంబర్ 1 నుంచి 7 బాపూజీనగర్, హైకోర్టు కాలనీ, బ్యాంక్ కాలనీ, సరస్వతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వెంటనే సమస్యలను పరిష్కరించాలి



జీకే కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని జీకే కాలనీలో శనివారం కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీ జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని కాలనీవాసులు తెలపడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ నవీన్, డివిజన్ అధ్యక్షుడు ఓంప్రకాష్, ఉపాధ్యక్షుడు సోమనాథ్‌చారి, సాయిసురేష్, రాజు, కళమ్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



రామంతాపూర్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలంటూ ఏబీవీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రామంతాపూర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు పలు ప్రాథమిక పాఠశాలలను ఏబీవీపీ నేతలు మూసివేయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాట్లాడుతూ పలు ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లు అనేక ఇతర మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉప్పల్ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోతే జిల్లా విద్యాధికారి కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా చేసిన భూమిని తిరిగి ఇప్పించాలని మంత్రికి వినతి

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లోని సర్వే నంబర్ 334, 335, 337, 338, 340లోని మా భూమిని కబ్జా చేసిన వారి నుంచి తిరిగి మాకు ఇప్పించాలని కొర్రెముల్‌కు చెందిన బాధితులు మంత్రి మల్లారెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. బోడుప్పల్‌కు చెందిన జెడిగే రమేష్ అనే వ్యక్తి మాలో ఒకరి వాటాలో 5 ఎకరాల భూమి కొనుగోలు చేసి జేకే ఫంక్షన్ హాల్ నిర్మించాడని, కొనుగోలు చేసిన భూమితో పాటు మా రెండెకరాల భూమిని ఆక్రమించి పశువుల షెడ్డు నిర్మించాడని మంత్రికి ఇచ్చిన లేఖలో ఆరోపించారు. మొత్తం భూమిని అధికారికంగా కొలిచి ఎవరి వాటా వారు తీసుకుందామంటే, భూమి లేదు ఎవరికి చెప్పుకుంటోరో చెప్పుకొండని, భూమిపైకి వస్తే చంపేస్తానని బెదిరిస్తూ మాపై దాడి చేశాడన్నారు. అలాగే మా భూమి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడని, ఈ విషయమై మాకు న్యాయం చేయాలని ఆంజనేయులు, శ్రీశైలం, హరికృష్ణ, అఖిల, బాలకృష్ణ, శివకుమార్ తదితరులు కోరారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: నందికంటి శ్రావణ్‌కుమార్ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు, ఫౌండేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. సోమవారం వెంకటాపురం డివిజన్‌లోని సుభాష్‌నగర్‌లో నందికంటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి షుగర్, బీపీ తదితర పరీక్షలను నిర్వహించారు. రానున్న రోజుల్లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తామని నందికంటి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి. క్రిష్ణాగౌడ్, ప్రభాకర్, ఎన్.శ్రీనివాస్, ఎస్.శివశంకర్, ఎస్.అశోక్‌రెడ్డి, టీఎస్.సంజీవ్‌కుమార్, వై.శివకుమార్, వినాష్, మేరీ, పద్మ, ఆశారాణి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌రెడ్డినగర్ సమస్యలు పరిష్కరించండి



రామ్‌రెడ్డినగర్‌లో పర్యటిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడ డివిజన్ రామ్‌రెడ్డినగర్‌లో సోమవారం ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామ్‌రెడ్డినగర్‌లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారిందని, ఇళ్ల మధ్య డ్రైనేజీ పొంగిపొర్లుతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ పట్టించుకోకపోవడం దురదృష్టకమన్నారు. వెంటనే రామ్‌రెడ్డినగర్ సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సత్యానారాయణగౌడ్, మాజీ అధ్యక్షుడు మల్లయ్య కురుమ, కురుమ సంఘం అధ్యక్షుడు అల్లం కొమరయ్య, మాజీ అధ్యక్షుడు బాలయ్య, నాయకులు నవీన్ ముదిరాజ్, రాఘవేందర్, చందుయాదవ్, మల్లేష్ యాదవ్, రాజు, కిషోర్, సిద్ధి, నర్సింహ, సిద్దు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో బంగారు భవిష్యత్ నాశనం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రామలింగరాజు

అల్వాల్: మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సాగుతున్న కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజు అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం అల్వాల్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ఏసీపీ రామలింగరావు మాట్లాడారు. మాదకద్రవ్యాల బారిన పడి యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందన్నారు. దీంతో సమాజంలో సంఘ వ్యతిరేక చర్యలు అధికం అవుతున్నాయన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి, కొకైన్ వంటి పదార్థాల గురించి తెలిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మహిళా శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ వినాయక రెసిడెన్సీ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఏర్పడిన శ్రీలక్ష్మీ వినాయక రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ అసోసియేషన్

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని 3వ డివిజన్ సత్యనారాయణపురం కాలనీ రోడ్ నంబర్– 7లోని శ్రీలక్ష్మీ వినాయక రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ నూతన కార్యవర్గం కొలువుదీరింది. అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు, ఉపాధ్యక్షుడు కొమరయ్య, కోశాధికారి శ్రీహర్షను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సూర్యప్రకాష్‌రావు మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఒకేచోట చేరి ఒకే కుటుంబంలా కలిసి ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీ వినాయక రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ నివాసి బిల్డర్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి తదతరులు పాల్గొన్నారు.

రామంతాపూర్‌లో వచ్చేనెల 16న బోనాలు



బోనాల ఏర్పాటు సమావేశం

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలో వచ్చే నెల 16న బోనాల పండగ జరుపుకోవాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు. స్థానిక మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాల నిర్వాహక కమిటీ గ్రామ పెద్దల సమావేశం నిర్వహించారు. 2వ తేదీన స్థానిక దూరదర్శన్ కేంద్రం వద్ద ఉన్న నల్ల పోచమ్మ ఆలయం నుంచి మహంకాళి దేవాలయం వరకు ఘటం ఊరేగించాలని తీర్మానించారు. సమావేశంలో బుర్ర రాజేశ్వర్ సుర్వి మురళీగౌడ్, కౌలన్ రవీందర్‌రెడ్డి, సర్వబాబు యాదవ్, వల్ల సత్యానారాయణ, వెంకటేష్, ఎరువకల శకుంతలమ్మతో పాటు గ్రామ వృత్తిదారులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న 'గ్రీన్ రిచ్ ఫ్రెండ్స్ అసోసియేషన్' ప్రతినిధులు

నల్లకుంట: ఉప్పల్ భగాయత్ వెస్ట్‌ఫేస్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని 'గ్రీన్ రిచ్ ఫ్రెండ్స్ అసోసియేషన్' ప్రతినిధుల బృందం మంత్రి కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉప్పల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కేటీర్‌ను అసోసియేషన్ ప్రతినిధుల బృందం కలిసి వినతి పత్రం అందజేశారు. ఉప్పల్ వెస్ట్ భగాయత్‌లో చాలా కుటుంబాలు నివాసముంటున్నాయని, ప్రజలకు కనీసం మౌలిక వసతులు కల్పించడంలో హెచ్‌ఎండీఏ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. తాగునీటి కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నల్లా కనెక్షన్లు మంజూరు చేయడం లేదన్నారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, గుంతలమయంగా మారిన రోడ్లతో ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. వీధిదీపాలు లేక రాత్రిపూట బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. వ్యర్థాలతో దుర్గంధం వెలువడుతోందన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.